విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 23 । జూన్ । 2025   8 పేజీలు

సమస్యలపై సీపీఐ పోరాటం

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగా ప్రభాకర్
సీపీఐ ఏలూరు నూతన కమిటీ ఎన్నికల

విశాలాంధ్ర ఏలూరు: ఏలూరు జిల్లాలో నెలకొని ఉన్న సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తోందని, నెలకొన్న ప్రజా సమస్యలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ అన్నారు. పేరుకు మాత్రమే ఏలూరు జిల్లా కేంద్రం, కార్పొరేషన్‌గా ఉందని అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. కార్పొరేషన్ పరిధిలో వార్షికంగా వచ్చే ఆదాయం, ప్రజా ప్రతినిధులు ద్వారా వచ్చే నిధులు ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేయకుండా తమ అనుచరులకు లాభాలు కట్టిబెట్టే విధంగా కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంతోపాటు, విద్య, వైద్యం, ఇతర సమస్యలు పరిష్కరిస్తూ ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శిగా ఉప్పులూరి హేమశంకర్, సహాయ కార్యదర్శిలుగా కురెళ్ళ

వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మిఇందిర ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏలూరు ఏరియా సమితి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డ ఉప్పులూరి హేమశంకర్ తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక, తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు పత్రికలకు విడుదలు చేశారు. ఈ సందర్భంగా హేమ శంకర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ శనివారం సీపీఐ ఏలూరు ఏరియా సమితి 6వ మహాసభలు స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగాయని పేర్కొన్నారు. ఈ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని పేర్కొన్నారు.

▶మిగతా 2లో

గిన్నిస్ రికార్డు కోసం గిరిజన పిల్లలకు కష్టాలు

ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, డి.శివ కుమార్

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం తన గొప్పల కోసం,మోడీ మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.అనేక మంది గిరిజన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుండి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్స్ నుండి యోగాంధ్ర కార్యక్ర మానికి అర్ధరాత్రి గం. 2లకు బస్సులో తరలించడంపై మండిపడ్డారు. రాత్రి సమయంలో విద్యార్థులకు నిద్రించడానికి సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు పిల్లలను తరలిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు? అనేక సంవత్సరాలుగా గిరిజన విద్యార్థులు సంక్షేమ హాస్టల్స్‌లో పౌష్టికాహారం అందక ఇబ్బంది పడుతున్నారని, ముందుగా కూటమి ప్రభు త్వం గిరిజన విద్యార్థులని రక్తహీనత నుండి దూరం చేయాలన్నారు. గిరిజన విద్యార్థులకు జ్వరం, వాంతులతో బాధపడితే హాస్పిటల్స్‌కు

▶మిగతా 2లో

యధావిధిగా

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: ప్రజల నుంచి ఫిర్యాదు లను స్వీకరించి, వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యా దుల పరిష్కార వ్యవస్థ జూన్ 23 సోమవారం జిల్లా స్థాయితో పాటు డివిజనల్, మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సి పల్ స్థాయిలో నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు ఈ విష యాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని

▶మిగతా 2లో

తనిఖీలకు వెళ్లొద్దు..!

- అధికారులకు అడ్డుతగులుతున్న ప్రజాప్రతినిధులు
- తూతూ మంత్రంగా దాడులు
- ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్న వైనం

ప్రజారోగ్యం కంటే వ్యాపారుల బాగే తమకు ముఖ్యమని కొందరు కూటమినేతలు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. కల్తీ ఆహారం తిని ప్రజలు అనారోగ్యం పాలైనా తమకేమిటి సంబంధం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆహార తనిఖీలకు వెళుతున్న అధికారులకు అది తమ వారిదేనని, అక్కడికి ఎందుకు వెళ్లారంటూ నిలదీస్తున్న పరిస్థితి నెలకొంది.తమ పార్టీకి మద్దతు దారులుగా, లేక సానుభూతిపరులుగా ఉన్నవారు నిర్వహిస్తున్న దుకాణాలకు వెళ్లకుండా అధికారుల ముందరికాళ్ళకు బంధాలు వేస్తున్నారు. దీంతో ఫలానా ప్రాంతంలో కల్తీ విక్రయిస్తున్నారని తెలిసినా అధికారులు చేష్టలు డిగి చూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. జిల్లాలో ప్రజా ప్రతినిధులు, నేతలు తీవ్ర జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: ఆహార నాణ్యత గాల్లో దీపంలా మారింది. ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో నాణ్యమైన ఆహారం మచ్చుకైనా దొరకడం లేదు. మెరిసేదంతా బంగారం కాదన్నట్లు మనం తినేదంతా మంచి ఆహారమేమీ కాదు. ఉరుకుల పరుగుల జీవితంలో ఏమీ తింటున్నామో, ఏమీ తాగుతున్నామో?అనే విషయాన్ని చాలామంది పట్టించుకోవడం లేదు. ఆకలైతే ఆ సమయానికి అక్కడ అందుబాటులో ఉన్న హెూటళ్లు, రెస్టారెంట్లు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను ఆశ్రయించి ఆకలి తీర్చుకుంటున్నారు. అలసట, ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం పండ్ల రసాలు,కూల్ డ్రింక్స్,స్నాక్స్ తీసుకుంటున్నారు. అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నారు. నిల్వ ఉంచిన మాంసాహార పదార్థాలను కుళ్ళిన,పాడైన కూరగాయలతో తయారుచేసిన వంటకాలను వడ్డిస్తున్నారు. ఆకర్షణ కోసం పరిమితికి మించి రంగులు వినియోగిస్తున్నారు. వీటిని తీసుకుంటున్న ప్రజలు వారికి తెలియకుండానే అనారోగ్యం పాలవుతున్నారు.

ప్రభుత్వ ఉదాసీనమే ప్రధాన కారణ

జిల్లాలో ఆహార కల్తీ జోరుగా సాగడానికి ప్రభుత్వ ఉదాసీనతే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే శాఖలు తప్ప ప్రజల ఆరోగ్యం కాపాడే శాఖలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆహార కల్తీ నియంత్రణపై అటు రాష్ట్ర స్థాయిలో ఇటు జిల్లా స్థాయిలో ఎవరు సమీక్షించిన దాఖలాలు లేవు.ఆ శాఖను బలోపేతం

యధావిధిగా పీజీఆర్ఎస్ : కలెక్టర్

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-రాజమండ్రి : ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ జూన్ 23 సోమవారం రోజున యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం "1100-మీకోసం కాల్ సెంటర్" కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు, నమోదైన మీ అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకో వచ్చునని ఆమె తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం meekosam.ap.gov.in పోర్టల్ నందు లేదా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వలేని వారు మీ కోసం వెబ్ సైట్ లో ఆన్‌లైన్ ద్వారా మీఫిర్యాదు నమోదు చేయవచ్చు అని ఆమె తెలియ చేశారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్,

▶మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

నేడు యధావిధిగా మీకోసం

మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు, మున్సి పల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు. అదే విధంగా అర్జీదారులు తమ అర్జీలను మీకోసం. ఏపీ.గవ్.ఇన్ వెబ్సైట్ నమోదు చేసుకోవచ్చని అలాగే వారి యొక్క అర్జీల నమోదు, వివరాలు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కూడా కలెక్టర్ తెలియజేసారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా ఫిర్యా దుల పరిష్కారాన్ని మరింత వేగవం తంగా, ప్రజల దృష్టికిమరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను నేడు సోమవారం మం డల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో నేడు ఉదయం గం.10 నుంచి యధా విధిగా పీజీఆర్ఎస్ కార్య క్రమం నిర్వహించబడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించిందన్నారు.ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్,లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చన్నారు.ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: https://meekosam.ap.gov.in ఫిర్యాదు నమోదు,ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయ వచ్చన్నారు.ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారు లకు చేరి, సమయానుకూలంగా పరిష్కారం వుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

యధావిధిగా పీజీఆర్ఎస్ : కలెక్టర్

మండల కేంద్రంలో జూన్ 23 ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరి స్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు , జిల్లా, డివిజన్ మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు నేరుగా ఫోన్ చేసి తాము అందచేసిన అర్జీల స్థాయి కూడా తెలు సుకునే అవకాశం ఉందన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి సత్వర పౌర సేవలను అందచేసేందుకు 955230 0009 వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వారి మొబైల్ ఫోన్లలో 9552300009 నెంబర్ సేవ్ చేసుకోవాలని కోరారు.

గిన్నిస్ రికార్డు కోసం

గిరిజన పిల్లలకు కష్టాలు

తరలించడానికి హెల్త్ వర్కర్లు, అంబులెన్స్ లు ఉండవు కానీ యోగా ఆంధ్రకు మాత్రం ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు.నిజంగా ప్రభుత్వానికి గిరిజన విద్యార్థుల మీద చిత్తశుద్ధి ఉంటే ఆ ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించాలని డిమాండ్ చేసారు.యోగాంధ్రా కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ మాట్లాడుతూ వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో హాజరవ్వడంపై హర్షం వ్యక్తం చేశారని అన్నారు.ముందు గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, హెల్త్ వర్కర్లను ఏర్పాటు చేసిన రోజున గొప్పలు చెప్పుకోండి అని సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే ఏఐఎస్ఎఫ్ గా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలపై సీపీఐ పోరాటం

నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారని ఏలూరు ఏరియా సమితి కార్యదర్శిగా ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శు లుగా, కురెళ్ళ వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా,మావూ రివిజయ,సాయన అభిలాష్ కుమార్, గొర్లి స్వాతి, కొల్లూరి సుధారాణిలతో పాటు 19 మంది కౌన్సిల్ సభ్యులుగా, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నగర కార్పొరేషన్

పరిధిలో ఇళ్ళు లేని పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇవ్వాలని, పోణంగి, మాదేపల్లి, కొమడవోలు, కొత్తూరు తదితర ప్రాంతాలలోని జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తీర్మానం చేశామని తెలిపారు. అనాదిగా అపరిష్కృతంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరిం చాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు, చొదిమెళ్ళ నుండి శనివారపు పేట దత్తాశ్రమం వరకు తమ్మిలేరుపై వంతెన నిర్మించాలని, పవర్ పేటలోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో నీరు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని తీర్మానం చేశామన్నారు. వీటితోపాటు ఇంకా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాడుతూ భవిష్యత్తులో ఉద్యమాలు నిర్మించే విధంగా ఐకమత్యంగా కృషి చేయాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశ ంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్,ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్,అడ్డగర్ల లక్ష్మి ఇందిరా, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, కౌన్సిల్ సభ్యులు కే కృష్ణమా చార్యులు, బజంత్రీ శ్రీనివాస్, ఉప్పులూరి లక్ష్మి, భవాని, కొల్లూరి సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక సుంకర వీరభద్రరావు భవనంలో ఆదివారం ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె సుభాని ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి జులై 15 వరకు జరగనున్న నిరుద్యోగ భృతి ఉద్యోగం ఉపాధి అవకాశాలకై ఉద్యమిద్దామని పిలుపు మేరకు పోరాడుదామని అన్నారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకో వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగం ఉపాధి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇవ్వాలి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలలో ఖాళీపోస్టుల ను భర్తీచేయాలని కోరారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకా శాలు కల్పించాలి కోరారు.అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించి యువతకు ఉద్యోగవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

వాసవి కన్యకా పరమేశ్వరి నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-నందిగామ: వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నూతన పాలకవ ర్గాన్ని వాసవి కన్యకా పరమేశ్వరి కమిటీ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చవట నాగేశ్వరరావును అధ్యక్షుడిగా వనమా నరసింహారావు సెక్రటరీగా మారం వెంకట సత్యనారాయణ కోశాధికారిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యం కార్యకలాపాల విస్తరణకు కృషి చేస్తామని తెలిపారు.

తనిఖీలకు వెళ్లొద్దు..!

చేసే పని కూడా చేయడం లేదు. గ్రామీణ ప్రాంతంలో ప్రతి లక్ష మందికి ఒకరు,పట్టణ ప్రాంతంలో ప్రతి 50వేల మందికి ఒక ఆహార భద్రతాధికారి ఉండాలి.జిల్లా కేంద్రంలో కనీసం 5 మంచి 6గురు అధికారులు అవసరం.జిల్లా కార్యాలయంలో సహాయ సిబ్బంది కూడా లేకపోవడంతో అధికారులు రోజువారి కార్యకలాపాలకే పరిమితం అవుతున్నారు. దీంతో తనిఖీలు సక్రమంగా సాగడం లేదు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ...

జిల్లాలోని 28 మండలాలలో ఆహార కల్తీ నియంత్రణ పర్యవేక్షణకు ఆహార భద్రతాధికారులు నెలకు కనీసం 10 దుకాణాల వరకు తనిఖీలు చేయాల్సి ఉంది. వీరిలో కొంతవరకు తనిఖీలకు వెళుతున్న మరో అధికారి ఎక్కడ ఉంటున్నారో.. ఎక్కడికి వెళు తున్నారో తెలియని పరిస్థితి ఉంది.

ప్రజా ప్రతినిధులు.. నేతల ఒత్తిళు

ఆహార కల్తీ నియంత్రణ అధికారులు అసలే అంతంతమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు.అవి సక్రమంగా జరగనీయ కుండా పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు అడ్డుకట్ట వేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడికి ఎందుకు వెళ్లారు అంటూ అధికారులను నిలదీస్తున్న పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రులతో పాటు, పలువురు జిల్లా ప్రజా ప్రతినిధులు మాదిరిగానే కూటమి ప్రజా ప్రతి నిధులు కొందరు దుకాణాలపై దాడులకు వెళ్ళనీయకుండా.. కేసులు నమోదు చేయకుండా అడ్డుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కఠినంగా చట్టాలు...

ఆహార భద్రత ప్రమాణాల 2006 సెక్షన్ 37 చట్టం ప్రకారం కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసే వారిని తనిఖీ చేసే పూర్తి బాధ్యతలను ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. సెక్షన్ 41 ప్రకారం కల్తీ చేసే వారిపై కేసులు, సీజ్ లాంటి చర్యలు చేపట్టవచ్చు. 2011 నుంచి వివిధ శాఖలకు అనుబంధంగా ఉన్న ఫుడ్ సేఫ్టీని విభజించి ఇతర శాఖలతో సంబంధం లేకుండా ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ విభాగంగా మార్చారు. అయినా కూడా అధికారులు తీరులో మార్పు రావడం లేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడే తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి ఆ తర్వాత నిమ్మకుండి పోతున్నారు. ఈ తీరుతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తీవ్ర విమర్శలు ఎదుర్కో వాల్సి వస్తోంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ ఫుడ్ సేఫ్టీ అధికారులు మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హోటళ్ళు,బిర్యానీ,టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాకిరణం రామకోటి

విశాలాంధ్ర-అవనిగడ్డ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ జడ్పిటిసి సభ్యులు దివంగత అడపా రామకోటి 17 వా వర్ధంతి ఘనంగా నిర్వహించారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో అడపా రామకోటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లా దారు విద్యార్థుల సమస్యలతో పోరాటం చేస్తూ విద్యార్థుల నాయకుడుగా ఆర్టీసీ కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఆర్టీసీ సమస్యలపై పోరాటం చేసి కార్మిక నాయ కులుగా అంచెలు అంచెలుగా ఎదుగుతూ అవనిగడ్డ జడ్పిటిసిగా నియోజక వర్గంలోని బడుగు బలహీన వర్గాల వారికి ఎన్నో సేవలు అందించి వారికి ఆశా కిరణంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అడపా రామకోటి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సింహాద్రి వికాస్ రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి గాజుల జై గోపాల్ కృష్ణా జిల్లా వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్టీఏ విభాగ అధ్యక్షులు పోనమాల నాగరాజు, వైసీపీ అధికార ప్రతినిధి గుర్రం బసవయ్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు జెడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష నివాళులర్పించారు.

ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ సేవలను సద్వినియోగించుకోవాలి: రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు లభించే వైద్య సౌకర్యాలను సద్వినియోగించుకో వాలని పెలికాన్ ఆసుపత్రి కోఆర్డినేటర్ పల్లెబాట రాజా ఆదివారం అన్నారు.

బెల్ట్ షాపులపై ఉక్కు పాదం

విశాలాంధ్ర-నూజివీడు : బెల్ట్ షాపుల నిర్వాహకులపై ఉక్కు పాదం మోపుతామని ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ.ఆవులయ్య హెచ్చరించారు. నూజివీడు పట్టణంలోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో బెల్ట్ షాపులకు సంబంధించి 425 కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో 227 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బెల్ట్ షాపులకు సంబంధించి అక్రమంగా ఉన్న మద్యం 1207 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో సారాను పూర్తిగా రూపుమాపినట్లు తెలిపారు. సారాకు సంబంధించి 752 కేసులు నమోదు చేయగా, 762 మందిని ఎప్పటికీ అదుపులోకి తీసుకున్నామన్నారు. సారా విడనాడి బయటకు వచ్చిన వారికి ఉపాధి కల్పించేందుకు తాము ఎప్పుడు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఇటీవల ఏలూరు జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో 40 కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం కృషితో కష్టపడి ఆర్థిక అభివృద్ధి చెందాలని సూచించారు. ఎలాంటి జాగ్రత్తలు లేకుండా విచ్చలవిడిగా కాసే సారావలన ఆరోగ్యాలు వేగంగా క్షీణిస్తాయని అన్నారు. సారా పై ప్రభుత్వం సమరం సాగించినట్లు చెప్పారు. సారాను 99 శాతం రూపుమాపినట్లు తెలిపారు. త్వరలో ఏలూరును సారా రహిత జిల్లాగా ప్రకటించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఏకాగ్రత

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: యోగాతో మానసిక ఏకాగ్రత ఏర్పడు తుందని పాఠశాల ఉపాధ్యాయులు మక్కే వేణు గోపాలరావు పేర్కొన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగిరి పల్లి మెయిన్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల చేత యోగాసనాలు చేయిం చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతిరోజు యోగా చేయాలని తెలిపారు. యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత, ఏకాగ్రత వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్య యులు దాసరి విజయదుర్గ, సర్నాల అరుణ, భీమవరపు హర్షవర్ధని, ఐ.ఈ. ఆర్.టి.ఉపాధ్యాయులు ఝాన్సీ, రజిని, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ సుల్తానా, అంగన్వాడీ సూపర్వైజర్ జి.రాగమయి, సీహెచ్ విజయదుర్గ, డి.వెంకటేశ్వరమ్మ, టి.భవాని, పి ఈశ్వరమ్మ, సచివాల యం ఇంజనీరింగ్ అసిస్టెంట్ అర్జున్,మహిళా పోలీస్ పి కృష్ణ స్వాతి, పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య ఒక్కటే అని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. టి నరసా పురం పంచాయతీ లోని కృష్ణా పురం గ్రామంలో బంజారా బజరంగీ భేరీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదవ తరగతి, ఇంటర్మీడి యట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా స్థాయి చేతక్ మెరిట్ స్కాలర్ షిప్ నగదు విద్యార్థులకు అందజేసి, విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగరాజు నాయక్ మాట్లాడుతూ విజ్ఞానవంతులు సమాజ గతిని మార్చి ప్రగతికి బాటలు వేస్తారన్నారు. పేదరికం కష్టా లను అనుభవించినా ఉన్నత విద్యను సాధించాలని అన్నారు. బడుగు బలహీన బంజారా వర్గాల విద్యార్థులకు విద్యలో పోటీతత్వాన్ని పెంపొందించుటకు బంజారా భజరంగీ భేరి సంఘం తరపున ప్రతి సంవత్సరం చేతక్ మెరిట్ స్కాలర్ షిప్ ను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జరభల కృష్ణ నాయక్, భూక్యా వేణు గోపాల్, మూడు శ్రీనివాస్ నాయక్, ఇస్లావత్ ప్రేమ్ చంద్, హను మంతు, భూక్యా రాజా నాయక్, జరభల చందా నాయక్, విజయ్కుమార్, బాణావత్ వేణు, జరబల రమేష్ ధరావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

- ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు రావలసిన ఇంక్రిమెంట్లు,మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్ కాష్మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది.ఆదివారం స్థానిక స్ఫూర్తి భవనంలో మున్సిపల్ ఉద్యోగుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి కిషోర్లు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బజంత్రీ శ్రీనివాస్లుమాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ నందు పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న 140 మంది పర్మినెంట్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఎన్ కాష్మెంట్ తదితర బిల్లులు 3 సంవత్సరాల నుండి బకాయిలు ఉన్నాయన్నారు. వీరిలో చాలామందికి మూడు సంవత్సరాల నుండి ఇంక్రిమెంట్లు, స్పెషల్ ఇంక్రిమెంట్లు (6,12,18, 24), బకాయిలు, 9 నెలల నుండి మెడికల్ బిల్లులు, గత రెండున్నర సంవత్సరాల నుండి చనిపోయిన, రిటైర్మెంట్ అయిన వారికి రావలసిన లీవ్ ఎన్ కాష్మెంట్ బిల్లులు బకాయిలు చెల్లించడం లేదన్నారు. బకాయి బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ పదేపదే తిరుగుతున్న సాంకేతిక కారణాలు చెబుతూ చెల్లించడం లేదన్నారు. కాబట్టి పారిశుధ్య ఉద్యోగులకు రావలసిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలగాడ దుర్గారావు అధ్యక్షతన కార్యక్రమంలో ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు దొడ్డికర్ల నాగ బాబు, వై.ప్రసాదు, కే.నాగే ంద్ర, బొచ్చ శంకర్, బంగారు లక్ష్మి, మాదుగుల భవాని, బం గారం అంకమ్మ, బంగారు సురేష్, పొద్దుటూరు సురేష్, బంగారు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలలో వాసవి క్లబ్ ముందుంటుంది

విశాలాంధ్ర-నరసాపురం: సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో వాసవి క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జయంతి వెంకటేశ్వర్లు అన్నారు.నరసాపురం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ శిబిరం లో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం చెప్పులు కుట్టే వారికి కావాల్సిన పనిముట్ల కిట్లను అందచేశారు. అప్పన ప్లాజాలో రైతును ఘనంగా సత్కరించారు. కోవెల గుడిలో 1000లీటర్ల వాటర్ ట్యాంక్ లను క్లబ్ తరుపున బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కనగళ్ల రామకృష్ణ, సెక్రటరీ కంచర్ల బాబ్జి, ట్రెజరర్ కోట్ల బాలకృష్ణ వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎనిమిదో రోజు ఆదివారం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు జంపన వెంకట రమణ రాజు ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని సానిటరీ వర్కర్స్కు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వలన ఆకలితో అలమటిస్తున్నారన్నారు. ఆకలితో విధులు నిర్వర్తించాలంటే కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, కాంట్రాక్టర్ వెంటనే సానిటరీ కార్మికులకు బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఈ నెల 25 నుంచి నిరవధిక నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేముల రాజు సంజీవ్ మేరీ చంద్రకళ దయామని జె. దుర్గారావు పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-భీమవరం: ఇండస్ట్రియల్ ఏరియా విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గం.వరకు నరసయ్య అగ్రహా రంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని విని యోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర-భీమడోలు: ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు డిసిసిబి చైర్మన్, ఏలూరు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు అయిన గన్ని వీరాంజనేయులు, ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గల నాలుగు మండలాల సమావేశం నాలుగు మండలాలకు పార్టీ నియమించిన పరిశీలకుల సమ క్షంలో జరిగింది. పరిశీలకుల సమ క్షంలో గ్రామ, మండల కమిటీల నియా మకం ఏకగ్రీవంగా జరిగింది. భీమ డోలు మండలానికి పోలవరం నియోజకవర్గం కుక్కునూరు మండల పార్టీ అధ్యక్షులు ముళిశెట్టి నాగేశ్వరరావు, గణపవరం మండలానికి పోలవరం నియోజకవర్గం వేలేరుపాడు మండల పార్టీ అధ్యక్షులు అశోక్, నిడమర్రు మండలానికి ఏలూరు నియోజక వర్గంకు చెందిన పూజారి నిరంజన్, ఉంగుటూరు మండలానికి ఏలూరు నియోజకవర్గం చెందిన వందనాల శ్రీనివాసరావు, నియో జకవర్గానికి కైకలూరుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరె క్టర్ న్యూరి రామచంద్ర రాజు నియమి తులవ్వగా వారి సమక్షంలో మండలాల వారీగా, నియోజకవర్గ సమావేశంలోను కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు పరిశీలన

విశాలాంధ్ర-చాట్రాయి: చాట్రాయి గ్రామంలో అటవీ సరిహద్దులలో ఉన్న భూములను ఫారెస్ట్ రెవెన్యూ అధికారులు ఉమ్మడి పరిశీలన నిర్వహించారు. మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో చాట్రాయి మండల తహసీల్దార్, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. విషయమై తహసీల్దార్ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ నెంబర్ 16 పరిసర ప్రాంతాలలో పరిశీలన చేసినట్లు తెలిపారు. నిర్ధారణకు రాలేదు అని తెలిపారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహం

విశాలాంధ్ర-టి నరసాపురం: తెల్లం గ్రామానికి చెందిన కంకిపాటి గణేష్ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి నందుకు కేతిరెడ్డి సీతా రామిరెడ్డి చంద్ర కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి(చినబాబు) ఆదివారం నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవేగి అంబే ద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550/600 మార్కులు సాధించడం పై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

ఎల్.వి.ప్రసాద్ వర్ధంతి

ఎల్.వి.ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

విశాలాంధ్ర -భీమవరం: భారతీయ సినిమాకి నడకలు నేర్పిన మహనుభావుల్లో ఎల్విప్రసాద్ ఒకరని, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకులని పలువురు వక్తలు అన్నారు. వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం తెలుగు సినీ నిర్మాత, దర్శకులు, నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత ఎల్విప్రసాద్ వర్ధంతి శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ కె చాన్ భాషా, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు మాట్లాడుతూ సినీ నిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ డిక్షనరిలో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడని, భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించినందుకు గాను దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్నారని అన్నారు. సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హిందీ, తమిళ, తెలుగు కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకుడిగా, నిర్మాతగా, నటుడిగా పలు విధాలుగా తన పాత్రను పోషించారని అన్నారు. కింది స్థాయి నుండి ఎవరికి అందనంత ఎత్తుకు ఎదిగిన ఎల్వి ప్రసాద్ సామాజిక సేవతో కూడ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, చల్లా రాము, సిహెచ్ సాయి, కే సుబ్బరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం :మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి భక్తులు ఆదివారం విరాళాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీ కృష్ణ, గ్రామ పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహశర్మల సమక్షంలో ఆలయ నిర్మాణ ప్రాంతం వద్ద విరాళాలను అందించారు. గ్రామానికి చెందిన రేలంగి నాగ మురళీకృష్ణ, శివప్రసాద్ (బ్రదర్స్) రూ.50వేలు, బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు కొటికలపూడి దేవి వెయ్యినూట పదహార్లు,వైవిఐఎన్ శివ కృష్ణ ప్రసాద్, (ఏలూరు) పదివేల నూట పదహార్లు,కాసుమిల్లి అరుణ్ కుమార్ చౌదరి ఐదు వేల నూట పదహార్లు, విరాళం అందజేశారు. మేకల అన్నవరం, మంచాల వెంకయ్య నాయుడు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఐలూరి విశ్వనాథ శర్మ, రాచూరి మదన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : స్వర్ణలత

విశాలాంధ్ర-పెదన: కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పెదన పట్టణ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు తలశిల. స్వర్ణలత అన్నారు. ఈ మేరకు ఆదివారం వీరభద్రపురం కర్ణభక్త కళ్యాణమండపంలో జరిగిన 7,8,9 వార్డుల కమిటీల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వాహబ్ ఖాన్, 7 వ వార్డు ఇంచార్జ్ తమ్మా. భీమయ్య, 8 వ వార్డు ఇంచార్జ్ యక్కల. బసవ, 9 వ వార్డు ఇంచార్జ్ కమ్మగంటి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులు

- శాయ్ కీచక కోచ్ ప్రసాద్ పై విచారణ చేపట్టిన అధికారులు
- ఆరోపణలు నిజమేనని నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర ప్రతినిధి ఏలూరు : అతనొక కోచ్... క్రీడాకారిణులలో ప్రతిభను వెలికి తీసి నైపుణ్యానికి తగ్గట్టు తీర్చిదిద్ది జిల్లా నుండి రాష్ట్రస్థాయి, దేశస్థాయికి పంపేందుకు సిద్ధం చేసే మహత్తరమైన గురుతర బాధ్యత అతనిది... క్రీడాకారిణులుగా రాణించాలని ఇతర ప్రాంతాల నుండి వచ్చి జిల్లా కేంద్రంలో ఉంటూ శిక్షణ పొందుతున్న వారికి అండగా నిలిచి శిక్షణలో మెలుకువలు నేర్పాల్సిన గురువు లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ క్రీడాకారిణుల గొంతులు మూగబోయాయి. ఇలా గత కొన్నేళ్లుగా వేధింపులకు గురవుతున్న పలువురు క్రీడాకారిణులు కోచ్ అరాచకాలపై బెంగళూరులోని శాయ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగ ప్రవేశం చేసిన సాయి అధికారులు క్రీడాకారులు చేసిన ఫిర్యాదులు వాస్తవమేనని నిర్ధారించుకొని స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో తదుపరి చర్యలు నిమిత్తం అథ్లెటిక్ కోచ్ ప్రసాద్ పై బాధితురాలితో ఫిర్యాదు చేయించారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ సంఘటన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తుంది. ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఉంటూ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు పట్ల అథ్లెటిక్స్ కోచ్ ప్రసాద్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు నగరంలో దావానంలా వ్యాపించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఏలూరులోని శాయ్ హాస్టల్ నిర్వహణపై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ వాటిని గుర్తు చప్పుడు కాకుండా నిర్వాహకులు ఉంచారని ప్రచారం గతంలో జోరుగాని సాగింది. ఈ హాస్టల్లో ఉంటూ క్రీడలను నేర్చుకుంటున్న క్రీడాకారిణులను బెదిరింపులకు పాల్పడుతూ హాస్టల్ లో జరుగుతున్న తంతు బయటకు గాని తల్లిదండ్రులకు గాని చెబితే హాస్టల్ నుండి పంపించి వేస్తామని చెబుతుండడంతో క్రీడాకారులు సైతం ఏమి చేయలేక మిన్నకుండి పోయే వారిని పలువురు బహిరంగంగానే కీచక కోచ్ ల గురించి విమర్శిస్తున్నారు. అథ్లెటిక్స్ కోచ్‌పై గత రెండు దశాబ్దా లుగా అనేక లైంగిక ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయవాడ స్పోర్ట్స్ అకాడమీలో హాస్టల్ ఇన్చార్జిగా పనిచేస్తున్న సమయంలో కూడా ఇదేవిధంగా అనేకమంది క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ తరుణంలో బెంగళూరు నుండి వచ్చిన శాయ్ అధికారులు ఏలూరులోని స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా శిక్షణ కేంద్రంలో వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, తదితర విభాగాల్లో శిక్షణ పొందుతూ వసతి పొందుతున్న బాలికలను విచారించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని తదుపరి చర్యలకు ఉపక్రమించారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఏలూరులోని సాయ్ శిక్షణ కేంద్రంలో బాలికలు వేధింపులకు గురి కావడం పట్ల పలువురు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సాయ్ శిక్షణ కేంద్రంలో కోచ్ ప్రసాద్ చెప్పిందే వేదంగా నడుస్తున్న కారణంగా ఉన్నతాధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు బహిరంగంగానే ఉన్నాయి. వాస్తవానికి సాయ్ శిక్షణ కేంద్రాలు ఉన్న వాటిని తరచుగా ఉన్నతాధికా రులు పరిశీలించి క్రీడాకారులకు అందుతున్న సౌకర్యాలు, వసతుల గురించి తెలుసుకోవాల్సినప్పటికీ పూర్తిగా కోచ్ ల పైనే శాయ్ అధికారులు ఆధారపడడంతో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా శాయ్ శిక్షణ కేంద్రాల విషయంలో ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులకు సరైన భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూ టౌన్ సీఐ అశోక్ కేసు నమోదు చేయగా మహిళా ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రోడ్డు నిర్మాణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాజవరం గ్రామ సర్పంచ్ ఏలేటి చిన తుక్కయ్య పేర్కొన్నారు. మండలంలోని గంగవరం గ్రామంలో 1400 మీటర్ల పొడవున పంచాయతీ నిధులతో గ్రావెల్ రోడ్డును నిర్మిస్తున్న తరుణంలో తుక్కయ్య పనులను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ రాజీ పడవద్దని నాణ్యతతో రోడ్లు నిర్మించాలని సూచించారు. రహదారులు నిర్మించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య, బల్లె కేసు బాబు, చిన్నంశెట్టి కిరణ్, జాలాది చంద్రం, ఈదుపుగంటి భాస్కర్, కందెల్లి అనిల్, కొడారి రాంబాబు, నగేష్, సుధీర్, సందీప్, మధు, కిరణ్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు లాడ్జిలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలు
- డ్రైవర్‌కు స్వల్పగాయాలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమలలో పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెల్యూర్ అయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని లాడ్జిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ద్వారకాతిరుమల నుంచి తణుకు వెళ్తుంది. ఇందులో సుమారు 70మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే స్థానిక గుడి సెంటర్ వద్దకు వచ్చే సరికి బ్రేక్ ఫెల్యూర్ అయి రోడ్డు పక్కన ఉన్న దేవస్థానం లైటింగ్ స్తంభాన్ని గోవింద గెస్ట్‌లైన్ (లాడ్జి)ని ఢీకొని ఆగిపోయింది. దీంతో బస్సులో ప్రయాణికుల ందరూ ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యాయి. ఈ ప్రమాదంలో అత్తిలికి చెందిన జి.ప్రభావతికి తీవ్ర గాయాలు కాగా తణుకుకి చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎం.శ్రీనివాసికి స్వల్ప గాయాలు య్యాయి. స్థానిక టీడీపీ నేత మొగతడకల ఓం ప్రకాష్ చౌదరి మానవతా దృక్పథంతో ప్రభావతికి వైద్యం చేయించి ఆటోపై ఆమె సొంత గ్రామానికి పంపించారు. ప్రయాణికులు కొంత మంది బస్సులు, మరి కొంత మంది ప్రైవేటు వాహనాల ద్వారా తమ సొంత గ్రామాలకు వెళ్లిపోయారు.

నేతాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్రసమితి ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి

విశాలాంధ్ర-భీమవరం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్రసమితి ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 86వ వ్యవస్థాపన దినోత్సవం పార్టీ భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లంక మాట్లాడుతూ బ్రిటీష్ ధ్వాస శృంఖలాలకు వ్యతిరేకంగా నేతాజీ నాయకత్వంలో చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. నేడు నల్ల దొరలు సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాపోరు సాగించాలని లంక దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుగ్గిరాల శ్రీనివాస్, మోటమర్రి శీను, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జలా పరమేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్పీ చైర్మన్ దంపతులు



విశాలాంధ్ర- ఏలూరు : స్థానిక దక్షిణ విధిలో కొలువై ఉన్న శ్రీ జల పరమేశ్వరస్వామి ఆలయాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చైర్ పర్సన్ పండితుల ఆశీస్సులు తీసుకుని జిల్లా ప్రజలు శాంతి, ఆనందం, సమృద్ధి కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి స్వచ్ఛత మరియు అభివృద్ధి పనులపై ఆలయ కమిటీతో చర్చించారు. ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన సహకారాన్ని జిల్లా పరిషత్ తరపున అంది స్తామని ఆమె హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంపై కార్మికుల హర్షం

విశాలాంధ్ర - కడియం : ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని, జీవీకేలో గల జీజీపీపీ కార్మికుల వేతనాల పెంపు సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకురాగా, సంబంధిత విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించినందుకు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ 48 కుటుంబాలలో వెలుగులు నింపారని కొనియాడారు. కడియం మండలం జేగురుపాడు గ్రామంలో పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్, నాగిరెడ్డి రామకృష్ణ, కార్మికులు ఆధ్వర్యంలో ఎంఎల్ఏ గోరంట్లను భారీ గజమాలతో సత్కరించారు. ఈసందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులకు గురి అయ్యారని, జీవో నెంబర్ 129/సిఐఎం లో వీళ్ళని చేర్చాలని ఆనాడే కోరడం జరిగిందని, అయినప్పటికీ వీళ్ళని చేర్చకుండా అధోగతి పాలు చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మికుల సమస్యను స్థానిక నేతలు తన దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే సంబంధిత శాఖామంత్రి తో మాట్లాడి వీరి సమస్యను తీర్చాలని కోరడం జరిగిందని తెలిపారు. అడిగిన వెంటనే కార్మికుల సమస్యను పరిష్కరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మార్గాని సత్యనారాయణ, అన్నదేవుల చంటి, పంతం గణపతి, చెల్లుబోయిన శ్రీనివాస్, ముద్రగడ జెమ్మి, గట్టి సుబ్బారావు, వరగోగుల వెంకటేశ్వరరావు, దేవాళ్ళ రాంబాబు, వట్టికూటి దత్తుడు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

జీవన్ సాయికుమార్ అభినందనీయుడు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: అఖిల భారత స్థాయిలో నీట్ లో 18వ ర్యాంకు సాధించిన దక్షిణ భారతదేశంలో మొదటి ర్యాంకు సాధించిన కాకర్ల జీవన్ సాయికుమార్ ఎంతో అభినందనీయమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన కాకర్ల జీవన్ సాయికుమార్ నీటిలో ఆల్ ఇండియా స్థాయిలో 18 ర్యాంకు దక్షిణ భారతదేశంలో మొదటి ర్యాంకు సాధించిన సందర్భంగా దేవరపల్లిలో ఆదివారం కాకర్ల సుబ్బయ్యమ్మ వీర్రాజు కళ్యాణ మండపంలో అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దుద్దుకూరు వంటి గ్రామీణ ప్రాంతంలో కాకర్ల కుటుంబం నుండి నీట్‌లో అత్యధిక మార్కులు సాధించటం గొప్ప విషయమన్నారు. మట్టిలో మాణిక్యంలాగా దుద్దుకూరు గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో దేశ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చిన కాకర్ల జీవన్ సాయికుమార్ ను అభినందించారు. భవిష్యత్తులో జీవన్ సాయికుమార్ వైద్య రంగంలో ఉన్నత స్థితికి చేరి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయి జీవన్ కుమార్ తండ్రి గంగాధర్ నాగ కుమార్ తల్లి నళిని దేవిలను అభినందించారు. ఈ సందర్భంగా జీవన్ సాయికుమార్ తండ్రి కాకర్ల గంగాధర నాగ కుమార్ మాట్లాడుతూ తన బిడ్డ విద్యాభ్యాసమంతా హైదరాబాదులో జరిగిందన్నారు. అఖిల భారత స్థాయిలో నీటు 2025 పరీక్షల్లో ఓపెన్ క్యాటగిరిలో 18 వరకు దక్షిణ భారతదేశంలో ఒకటవ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 720 మార్కులకు 670 మార్కులు సాధించాడని ఆయన తెలిపారు. తన బిడ్డ విద్యారంగంలో అభివృద్ధి సాధించినం దుకు తమ కాకర్ల కుటుంబీయులకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాకర్ల జీవన సాయికుమార్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు గురువులు సహకారంతో తాను నీటిలో అత్యధిక మార్కులు సాధించాలని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు సేవలు అందిస్తానని తన అమ్మమ్మ కల డాక్టర్ గా నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకర్ల వెంకటేశ్వరరావు, కాకర్ల బాలసుబ్రమణ్యం, కాకర్ల శ్రీ హరిబాబు, కాకర్ల రామారావు, కాకర్ల నరసింహమూర్తి తదితరులు సాయికుమార్‌ను సన్మానించారు.

వైద్య ఆరోగ్యశాఖ బదిలీలపై ఏపీజీఈఏ సంతృప్తి

విశాలాంధ్ర - కడియం : రాష్ట్రంలోనే అతిపెద్ద శాఖ అయిన వైద్య ఆరోగ్య శాఖలో, అత్యధిక కేడర్లతో కూడిన ఈ శాఖలో ప్రభుత్వం మునుపెన్నడూ లేనంత పారదర్శకంగా, నిబంధనలకు లోబడి చేపట్టిన ఉద్యోగుల బదిలీల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఇఎ) సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ బదిలీలు పారదర్శకంగా జరగడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యాకుమార్ యాదవ్‌లకు సంఘం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. తూర్పు గోదావరి జిల్లాలో రీజనల్ డైరెక్టర్ జోన్ - II, డాక్టర్ పద్మ శశిధర్ బదిలీలను చాలా చక్కగా నిర్వహించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగిన సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు పి. గిరి ప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల బదిలీలలో జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్ ఉద్యోగ సంఘాలకు తోడ్పాటు అందిస్తూ బదిలీలు సక్రమంగా జరగడానికి చర్యలు తీసుకున్నారని కొనియాడారు. పి రవి కుమార్ మాట్లాడుతూ, తన 40 సంవత్సరాల అనుభవంలో ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఏపిజిఇఏ చేసిన కృషికి ఉద్యోగుల అభినందనలు సంతోషదాయ కమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ శశిధర్ కి వైద్య ఉద్యోగుల పక్షాన తమ సంఘం కృతజ్ఞతలు తెలియజేస్తున్నమన్నారు. రెవెన్యూ శాఖలో బదిలీలు సక్రమంగా జరగడానికి చర్యలు తీసుకున్న జిల్లా రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్‌కి జిల్లా ఉపాధ్యక్షులు కమల్ సుందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీవల్లి, వెంకటరాజు, రాజా రావు, రమేష్, గోపాలకృష్ణ, దినేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ వి నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఏ గురుకుల పాఠశాలలో అయినా దరఖాస్తు ఫారం ఇవ్వవచ్చని ప్రిన్సిపల్ చెప్పారు. 25న బాలురకు లక్ష్మీ నరసాపురం గురుకుల పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు ఉదయం 10 నుంచి 11మధ్య, 8,9 తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్సి, ఎస్టి, బీసీ విద్యార్థులు అర్హులని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు వివరించారు.

చిట్టూరిని తలారి పరామర్శ

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు పట్టణ వైసీపీ అధ్యక్షులు చిట్టూరి అన్నవరం కంటి ఆపరేషన్ చేయించుకున్నారని తెలిసి కొవ్వూరు వైసీపీ ఇన్చార్జ్ తలారి వెంకట్రావు ఆదివారం పరామర్శించారు. చిట్టూరి అన్నవరం ఆరోగ్య వివరాలు తెలుసుకుని తనకు వైఎస్ఆర్సిపి ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పాశాలమ్మ జాతర మహోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో గల కాటవరం గ్రామ దేవత శ్రీ పాశాలమ్మ అమ్మవారు జాతర మహోత్సవం జూన్ 18 నుండి 22 వరకూ ఐదు రోజుల పాటు కనుల పండు గుగా గ్రామస్తులు నిర్వహించారు. . శనివారం అమ్మవారికి సంప్రదాయ పద్ధతిలో నైవేద్యం సమర్పించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుతీరి తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటి వద్ద ఆడపడుచులు, బంధుమిత్ర సపరివారంతో కలిసి భోజనాలను పెట్టుకొన్నారు. దీనితో గ్రామం అంతా సందడి సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై డ్రోన్ అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం లోని దుద్దుకూరు గ్రామం 'శ్రీ పద్మావతి సిహెచ్ సి (గ్రూప్' సభ్యుల ఆర్ కె వి వైవతకంలో భాగంగా 80%రాయితీ పై రైతులకు 'డ్రోన్' అందించారు. పంటలకు పురుగు మందులు పిచికారి చేయడానికి సన్న ,చిన్నకారు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం రాయితీ పై డ్రోన్లను అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి కమల్ రాజ్ తెలిపారు. దేవరపల్లి మండలంలోని దుద్దుకూరు గ్రామంలో శ్రీ పద్మావతి స్వయం సహాయక సంఘం సభ్యులకు డ్రోన్ ను అందజేశారు. డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు , ఇందులో 5 లక్షలు గ్రూప్ రైతుల వాటా, రూ 5 లక్షలు బ్యాంకు రుణం ఉందన్నారు. ఈ మొత్తం లో 80 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని 20 శాతం రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యవసాయ అనుబంధ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం బస్సులు దారి మళ్లింపు

విశాలాంధ్ర - రాజమహేం ద్రవరం రూరల్ : తమ డిపో నుండి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వెళ్ళే బస్సులు ధారి మళ్లింపు చేయడం జరిగిందని, ఈ మార్పును ప్రయాణికులు గమనించి సహకరించాలని తూర్పు గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి యేలూరి సత్యనారాయణ మూర్తి అన్నారు.ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డిపిటివో వై.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు గ్రామం వద్ద రైల్వే గేట్ మరమ్మతులు నిమిత్తం రైల్వే గేట్ మూసివేయడం జరిగిందని, ఈ కారణం చేత రాజమహేంద్రవరం నుండి తాడేపల్లిగూడెం బస్సులు వయా నిడదవోలు, తిమ్మారా జుపాలెం, అప్పారావు పేట, మాధవరం, నవబ్ పాలెం, ప్రత్తిపాడు గ్రామాలు వైపుగా ఈ నెల 22 నుంచి ధారిమళ్లించినట్లు చెప్పారు. మరమ్మతులు పనులు పూర్తి అయ్యేందుకు దాదాపు వందరోజులు సమయం పట్టవచ్చని రైల్వే అధికారులు అంచనాలు వేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఉదయం 5.15, 6.00 6.30, 7.00, 7.30, 7.50 నుండి రాత్రి 9 గంటల వరకు ప్రతి 20 నిమిషాలకు అదేవిధంగా తాడేపల్లిగూడెం నుండి రాజ మహేంద్రవరం డిపోకి ఉదయం ఐదు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రతి 20 నిమిషాలకు బస్సులు నడపబడుతాయన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తదనానికి నిలువెత్తు రూపం నాగార్జున

కుబేర సక్సెస్ సంబరాల్లో నాగ్ అభిమానులు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : చిత్ర పరిశ్రమ లో కొత్తదనానికి నిలువెత్తు రూపం సెల్యులాయిడ్ సైంటిస్ట్ కింగ్ నాగార్జున పెట్టింది పేరని రాజమహేంద్ర వరం అక్కినేని అభిమానుల సంఘం అధ్యక్ష , ఉపాధ్యక్షులు కాటం రజనీకాంత్, కాపు భాను అన్నారు. కింగ్ నాగార్జున అక్కినేని, తమిళ్ న్యాచురల్ హీరో ధనుష్, రష్మిక మందన్న హీరో హీరోయిన్లుగా రూపొందించిన కుబేర చిత్రం జూన్ 20న పాన్ఇండియా సినిమాగా ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలతో విడుదలై కలెక్షన్ల సునామి సృష్టించిన విషయం అందరికీ విదితమే.ఈ సందర్భంగా జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవ రంలోని స్వామి థియేటర్ వద్ద అక్కినేని అభిమానులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. దీనిలో భాగంగా భారీ కేకు కోసి అభిమానులకు పంచారు. సీనియర్ అభిమానులకు దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగార్జున యాక్షన్, ధనుష్ పెర్ఫామెన్స్ అద్భుతం అని కొనియాడారు.చిత్రం విడుదలకు ముందు నాగార్జున చెప్పినట్లు సినిమాకి దర్శకుడు శేఖర్ కమ్ములనే హీరో అన్న మాట వస్తామని చెప్పారు. కుబేర' బుకింగ్స్ మొదటి షో నుండి ఊపందుకున్నాయన్నారు.ఈ నేపధ్యంలో మూడు రోజులకు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 90 కోట్లు వసూలు చేసి అక్కినేని స్టార్డమ్ మరోసారి రుజువు చేశారన్నారు.అనంతరం స్వామి థియేటర్ నందు ఆదివారం జరిగిన సంబరాలు అంబరాన్ని తాకాయి. అభిమానుల ఆనందోత్సాహాల మధ్య 'కేక్' కటింగ్ చేసి, అభిమానులకు థియేటర్ సిబ్బందికి స్వీట్స్ పంచారు.అలాగే థియేటర్ యాజమాన్యం ఆణిబాబు,మేనేజర్ నాగేష్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు అబ్బుల్లా, కరీం, శిష్టి, షాన్, రాజ్ కుమార్, పట్నాల శ్రీనివాస్, జి.సత్తిబాబు, ఎస్.మల్లికార్జునరావు, టీ.గుప్తా, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హై స్కూల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని వివిధ యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ వేముల రాజు, టిడిపి నాయకులు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు ,గ్రామ కార్యదర్శి ఎన్ కిషోర్ మాజీ సర్పంచ్ కోట్ల భీమరాజు ఉపాధ్యాయులు అంగన్వాడీ సిబ్బంది ఆశా సిబ్బంది స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు . అలాగే అదేవిధంగా దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ఎంపీపీ ఎస్ మెయిన్ స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం నిమ్మకాయల సంజీవ్ కుమార్ , ఉపాధ్యాయులు కె.పి బిందు, ఎస్ శ్రీ కన్య, ఎం ఎస్ మహాలక్ష్మి, గ్రామ టిడిపి అధ్యక్షులు కోట రుద్రువ కాంత్, గ్రామ ప్రజలు విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర కొవ్వూరు : కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమనే రామకృష్ణ జన్మదిన వేడుకలను కొవ్వూరు పట్టణ తెలుగు యువత ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు నియోజకవర్గం లోని అతిరథ మహారథులు పాల్గొని అభిమాన నేత కంట మని రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు . తెలుగు తమ్ముళ్ల ఆనందోత్సవాల మధ్య రామకృష్ణ కేకులు కట్ చేసి అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేసిన అని నియోజకవర్గ నాయకులను కలుపుకుంటూ అందరి మన్ననలను పొందుతూ మరెన్నో జరుపుకోవాలని కోరారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షులు కాకర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు భోజనాలు పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. వీధి యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కొవ్వూరు మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, ఏం సి చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని,సూర్యదేవర రంజిత్ కుమార్, మద్దిపట్ల శివరామకృష్ణ, తెలుగు యువత నాయకులు దండమూడి సాయికృష్ణ, కంఠమని చరణ్, కాకర్ల దొరబాబు, కొడవలి అనిల్, గుత్త శ్రీనివాస్, ఎన్డీఏ కూటమి నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఎమ్మెల్యే గోరంట్లను విమర్శించే అర్హత వైసీపీకి లేదు : కూటమి నేతలు

విశాలాంధ్ర - కడియం : అభివృద్ధి ప్రదాత, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని విమర్శించే అర్హత ఏ వైసీపీ నాయకులకు లేదని కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం కడియం టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గోరంట్లను మహిళలు అడ్డగించారని గగ్గోలు పెడుతున్నారని, వాస్తవానికి మహిళలు ఘన స్వాగతం పలికారని అన్నారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడింది వైసీపీ వారేనని, వారు చేసింది తప్పు అని తెలుసుకోలేని స్థితిలో వైసీపీ వారు ఉన్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో తప్పులను ఎత్తి చూపే వారిని హౌస్ అరెస్టు చేసేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచిస్తుందని, అనవసరమైన ఆరోపణలు చేసుకుంటూ కాలం వృధా చేయవద్దన్నారు. అవినీతి స్కాంలలో ఉన్న వారిని అరెస్ట్ చేస్తుంటే అక్రమ అరెస్టులు చేస్తున్నారంటూ, తప్పు చేసిన వారిని సమర్థించడం తగదన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల ఏ తప్పు మాట్లాడలేదని, రూరల్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారని, అటువంటి అభివృద్ధి ప్రదాతను విమర్శించే అర్హత వైసిపి వారికి లేదన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల ను నియోజకవర్గంలో తిరగనివ్వమంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని, ఎలా తిరగనివ్వరో మేము చూస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మీద ఈగ కూడా వాలకుండా చూసుకునే కార్యకర్తలు టిడిపిలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని మండల జనసేన అధ్యక్షుడు ముద్రగడ జమీ, ఆదిమూలం సాయిబాబా చిక్కాల ఈశ్వరరావు ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి సాగులో సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టాలి

విశాలాంధ్ర - రాజానగరం : వరి సాగిన ప్రధాన పంటలో సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని ఏరువాక కేంద్రం వద్ద గత 13రోజులుగా అందిస్తున్న శిక్షణ తరగతులు ఆదివారానికి 14వ రోజుకి చేరాయి. వరి పంట సాగులో వ్యవసాయ మెలకువలు అనే అంశంపై ఆయన ట్రైనీలకు శిక్షణ అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వరిలో శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన సిఫారసులకు అనుగుణంగా, సమగ్రమైన సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, రసాయన ఎరువులు వాడితే, భూసార పరిరక్షణ జరిగి, వరిలో నాణ్యమైన దిగుబడులు పెంచుకోవచ్చని చెప్పారు. పంటల్లో ఎరువులు వాడే విధానం, ఎక్కువగా ఎరువులు వాడితే, పంట ఆవరణంలో కలిగే నష్టాలు, వివిధ సేంద్రియ ఎరువులు వంటి విషయాలను పవర్ పాయింట్ ద్వారా ఉదాహరణ లతో ట్రైనీలకు వివరించారు. వ్యవసాయ పరపతి సంఘ డీలర్లు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. మరో అతిథి శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిలో పంటలో వేయవలసిన ఎరువుల మోతాదు, పోషకాల ప్రాముఖ్యతను వివరిం చారు. కోనసీమ జిల్లాలలో పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్స్ అందించేందుకు జిల్లా ఏరువాక కేంద్రంలో ఈ నెల 9 నుండి శిక్షణ తరగతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీలకు వర్మీ కంపోస్ట్ తయారీ పై విజ్ఞాన యాత్ర నిర్వహించారు.

శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామానికి చెందిన ప్రత్తిపాడు 99 టీవీ రిపోర్టర్ దొడ్డి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలికులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరు మురళి రాజు మురళి రాజు మాట్లాడు తూ తొందరగా కోలుకో వాలని కోరుకుంటూ దైర్యం చెప్పి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, నల్లా వెంకటేశ్వరరావు, కోలా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర -తాళ్లపూడి : ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామ్య మైనప్పటికీ, జనసేన పార్టీని కొవ్వూరు నియోజకవర్గంలో టీడీపీతో జనసైనికులను కలుపుకోని పరిస్థితులు బాధాకరం అని, అందుకే గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాన్ని చేపట్టి తమ సత్తా చూపాలని ప్రయత్నం చేపట్టామని కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి టి.వి.రామారావు పేర్కొన్నారు. జనసేన పార్టీ ఆత్మీయ సమావేశాన్ని తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు కాకర్ల కళ్యాణ మండపంలో జరిగిన భారీ సమావేశానికి టివిఆర్ అద్వర్యంలో భారీ ర్యాలీగా జనసైనికులు తరలి వచ్చారు. ముఖ్యంగా పార్టీ బలోపేతం చేయటం తో పాటు, తాళ్లపూడి మండలంలో మంచి నాయకత్వం కావాలనీ కోరుతూ సమావేశం పలువురు ప్రసంగించారు. ఈ సమావేశానికి టివిఆర్, మారిశెట్టి వెంకటేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా విచ్చేసారు. మండలం లోని పలు గ్రామాల నుండి జనసైనికులు హాజరయ్యారు. పెద్దేవం నుండి వైకాపాకు చెందిన కల్లూరి సుబ్రహ్మణ్యం ఆద్వర్యంలో భారీగా జనసేన లో చేరారు. రావూరుపాడు నుండి సిద్ద రామకృష్ణ, బల్లిపాడు ప్రసాద్, పైడిమెట్ట విత్తం నాని, ప్రక్కిలంక సంగడి రాము, , తాళ్లపూడి ఐతం మణికంఠ, అన్నదేవరపేట చెవురి బంగారం ఆధ్వర్యంలో జనసేన లో చేరారు. ఈ కార్యక్రమంలో దూసనపుడి రామాంజనేయులు, కోకుకుల అబ్బులు, బర్ల శ్రీను, పులపల్లి బాలకృష్ణ, అవుదు కృష్ణ, పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం మండలంలో సోమవారం న్యూ ఫీడర్ ఆర్డీఎస్ఎస్ వర్క్ కారణంగా సోమవారం మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆదివారం ఎలక్ట్రికల్ ఇఇ కె రాంబాబు తెలిపారు. పనులు కారణంగా ఉప్పలగుప్తం, పేరాయిచెరువు, జగ్గరాజు పేట, గొల్లవిల్లి, వాడపర్రు, కూనవరం, కిత్తన చెరువు, చీకట్లపాలెం, సన్నవిల్లి, సూదాపాలెం, భట్టుపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విల్లసవిల్లి, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎన్ కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు ఉదయం 10 గం.నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఇఇ రాంబాబు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని రాంబాబు కోరారు.

27న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ చంద్రన్న సమావేశ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన శుక్రవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించుట జరుగుతుందని ఎంపీడీవో ఎం అనుపమ పేర్కొన్నారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్టేట్ సభ్యులు మండల వివిధ శాఖల అధికారులు, మెడికల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎండిఓ అనుపమ తెలిపారు. మండలంలో జరుగు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుట వివిధ అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నమన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం

విశాలాంధ్ర - మామిడికుదురు : అప్పనపల్లి బాడవలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 8 సంవత్సరాలు సుదీర్ఘ కాలంపాటు ఉపాధ్యాయురాలుగా పనిచేసిన కుడిపూడి అరుణ జ్యోతిని ఆదివారం ఉచ్చులవారి పేట అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు అందించి బదిలీపైన వేరే పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయినికి వీడ్కోలు పలుకుతూ ఆమె చేసిన సేవలను కొనియాడారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే చిరస్థాయిగా నిలుస్తారని అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ గెద్దం వేంకటేశ్వరరావు అన్నారు. సంఘ వైస్ ప్రెసిడెంట్ యన్నాబత్తుల రాజేష్, సెక్రటరీ కారుపల్లి సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ చిట్టాబత్తుల నాగరాజు, ఉపాధ్యాయులు విప్పర్తి మోహనరావు, కారుపల్లి కళ్యాణ్ బాబు, అంగన్వాడీ టీచర్ గెద్దం పళ్ళాలమ్మ, స్థానికులు బత్తుల జనార్దన్, నీతిపూడి మహేష్, ఇసుకుపట్ల రాము, పైడి గణేష్, బత్తుల పూర్ణ చంద్రరావు, నీతిపూడి నాగరాజు, నాగాబత్తుల సురేష్, చిట్టాబత్తుల వెంకటేష్, మట్టా వెంకటేష్. బత్తుల నాగేశ్వర రావు, మధ్యాహ్న భోజన వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర - పిఠాపురం : ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జూనియర్ బాలబాలికల రగ్బీ ఎంపికలు పిఠాపురంలో జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వందమంది క్రీడాకారులు పాల్గొనగా, బాలురు నుంచి 12 మంది, బాలికల నుంచి 12 మంది ఎంపికైనట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు వియ్యపు రామన్నరాజు, సభ్యులు ఎమ్మిడిశెట్టి నాగేంద్ర, కోచ్ లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 28, 29లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి బీ శ్రీనివాస్ ఎంపికైన బాలబాలికలను అభినందించారు.

క్రికెట్ కప్ విజేత సీతారామపురం

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల పంచాయతీలో బీజేపీ సభ్యులు అజేయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాసరి రవిరాజు మెమోరియల్ క్రికెట్ పోటీల్లో సుమారు 45 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సీతారామపురం విజేత గాను, గొర్రిపూడి జట్టు రన్నర్‌గా నిలిచారు. విజేతలకు బీజేపీ శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, ముమ్మిడివరం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు చెల్లి వివేకానంద, దాట్ల పృథ్వీల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడు తూ కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీ సహకారంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళరేవు మండలంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రం లోని తాడిపూడి గ్రామంలో ఎస్‌బి పాలెం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడిపూడి గ్రామమనకు చెందిన యువ నాయకులు కునంపూడి రామకృష్ణంరాజు(బాబు) రూ.5000 వేలు ఆర్థిక సహాయంతో పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు, ఇతర స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని, తల్లికి వందనం అమలు చేసిందని తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలకు తమ బాలలను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వివిఎన్ఎస్ ప్రసాద్, సహ ఉపాధ్యాయులు వి రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు పేరిచర్ల భీమరాజు, గ్రామ పెద్దలు, ఎస్ఎంసి చైర్మన్ కేతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల 23న నిర్వహిస్తున్న యువతపోరు పేరిట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ పార్టీ శ్రేణులకు వైసిపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు కోరారు. గత ఏడాదికాలంగా ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు విడుదల చేయలేదని. తల్లికివందనం పేరిట కొందరికి నగదు జమ అయిందని. గత ప్రభుత్వంలో లేని సాకులు చెప్పి నేడు కొంతమందికి నిలుపుదల చేయటం జరిగిందని అన్నారు. వైసీపీ పార్టీ విద్యార్థి మరియు యువజన విభాగాల నాయకులు ఆధ్వర్యంలో జరగబోవు కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రపంచంలో ఆంధ్రాకు గుర్తింపు

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక బాలాజీ చెరువు సమీపాన ఉన్న పిఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చేయూత సంస్థ సంయుక్తా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డిఐకెవివి సత్యనారాయణ పాల్గొనగా, ఇతర పాఠశాలల నుండి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీడీలు పట్టాభి, బేగంల ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు. వక్తలు ప్రధానోపాధ్య యులు ప్రేమ జ్యోతి, చేయూత వ్యవస్థాపకులు డాక్టర్ మొండి రవికుమార్‌లు మాట్లాడు తూ యోగాంధ్ర కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కృషి ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు రావడమే కాక గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు కూడా కైవసం చేసుకోవడం గొప్ప విషయంగా చెప్పారు. యోగ విద్య ద్వారా కలిగే ప్రయోజనాలను గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ తరగతులను, నిర్వహించడమే కాక అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం ఆరోగ్యాంధ్రకు స్వర్ణ యుగముగా డాక్టర్ రవికుమార్ ప్రస్తావించారు. యోగాను పాఠ్యాంశంగా ప్రవేశపడితే రాష్ట్ర ప్రయోజనం ఆశించిన ఫలితాలు తప్పక పొందగలమని డాక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించబడిందని, ముఖ్యంగా కాకినాడ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నడూ జరగని విధంగా విజయవంతంగా నిర్వహించబడిందని జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా డాక్టర్ రవి కుమార్ అభినందించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పాఠశాలలోనూ యోగాసనాలు వేసే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించే విధంగా ప్రణాళికలను కమిటీ సభ్యులతో సమీక్షించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని రవికుమార్ ప్రకటించారు. అనంతరం ఆసనాలు వేసిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట తహసీల్దార్ కొప్పూరు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా రెవెన్యూ డేను నిర్వహించి పలువురు రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులకు ఘనసత్కారం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కొప్పూరు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు అయిన సందర్భమునకు గుర్తుగా ప్రతి సంవత్సరం జూన్ 20న రెవెన్యూ దినోత్సవం 'రెవెన్యూ డే'గా సంబరాలను నిర్వహించుకొవ డానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, మన భారతదేశములో అంతకు దాదాపు రెండు శతాబ్దాల క్రితమే తాలూకా/తహసీల్దార్ల వ్యవస్థ వ్యవస్థీకృతమై ఉన్నది. ఉదాహరణకు క్రీస్తు శకం 1680 భూమి శిస్తు దుర్వినియోగ అభియోగముపై భక్త రామదాసుగా ప్రసిద్ధుడైన నాటి పాల్వంచ పరగణా తహశీల్దారు అయిన కంచర్ల గోపన్నను దాదాపు 12 సంవత్సరముల పాటు ఖైదు చేసిన విషయం జగద్విదితమే. ఇప్పటి రెవెన్యూ పాలన మూలాలు అప్పటి నుండే ఉన్నాయి. అంతకు ముందు ప్రాచీన కాలములో రాజోద్యోగులుగా పిలవబడిన వారు రెవెన్యూ ఉద్యోగులే అని అన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులకు ఘనంగా పూలమాలలతోనూ, శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి, ప్రధాన కార్యదర్శిగా జక్కంపూడి

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండల బూత్ కమిటీలు, యూనిట్ కమిటీలు, క్లస్టర్, గ్రామ కమిటీలు, మండల పార్టీ కమిటీలు, అనుబంధ సంఘాల ఎన్నిక ప్రక్రియ పార్టీ పరిశీలకుల సమక్షంలో జరిగింది. నూతనంగా ఎంపికైన వారిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. పార్టీ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. రావులపాలెం మండల టీడీపీ పరిశీలకుడిగా మొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు. రావులపాలెం మండల టీడీపీ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జక్కంపూడి బాలాజీ నియమితుల య్యారు. క్లస్టర్ ఇంచార్జిలుగా ముదునూరు వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కరటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, కంఠం శెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కర్ రావు, కముజు గంగాధర్ రావు, గుత్తుల పట్టాభి రామారావు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవులో పిల్లి ధనరాజు, సత్యవతి, వెంకట్రావు , ధరణి సత్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులచే ఆదివారం ఉదయం కాకినాడ కిరణ్ నేత్ర వైద్య సంస్థ ద్వారా సుమారు 200 మందికి ఉచిత నేత్ర పరీక్షలు చేయించారు. అందులో 50 మందికి ఆపరేషన్లు పడతాయని డాక్టర్ అనూషా చెప్పారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వ హక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) సంద ర్శించి పిల్లి వారి కుటుంబ సభ్యులు సత్యనారాయణ, కొండ, వాసు, ధనరాజు సుబ్రహ్మణ్యం ఈవిధంగా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి సభ్యులు బాబూరావు, వాశంశెట్టి శ్రీనివాస్, వుంగరాల వెంకటేశ్వరరావు, మేడిశెట్టి సత్తిబాబు, దుర్గా ప్రసాద్, గంజా సూరిబాబు, రోళ్ళ చక్రవర్తి, చిరంజీవి, మల్లేశ్వరరావు, హేమలత, బండారు శ్రీను పాల్గొన్నారు.

జవహర్ నవోదయకు రాజ్ దీవెన్‌పాల్ ఎంపిక

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట డివిఆర్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి రాజ్ దీవెన్ పాల్ జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ఎంపికయ్యాడు. అమలా పురంలోని విక్టరీ అకాడమీలో శిక్షణ పొంది నవోదయ ప్రవేశ పరీక్షలో రాజ్ దీవెన్ 82.5 మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందినట్లు రాజ్ దీవెన్ పాల్ తండ్రి దంగేటి ఆదినారాయణ తెలిపారు. తన కుమారుడు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అత్యున్నత విద్యాసంస్థ అయిన నవోదయలో ఎంపిక కావడం కుటుంబానికి గర్వకారణ మన్నారు. డివిఆర్ స్కూల్ కరస్పాండెంట్ డి వెంకటేశ్వర రావు, విక్టరీ అకాడమీ ప్రిన్సిపాల్ తాడి వెంకట సురేష్ విద్యార్థిని అభినందించారు. రాజ్ దీవెన్ పాల్ సాధించిన ఈ విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు ప్రశంసించారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి వసంత మండపంలో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. చందన సరాపుదైన వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భద్రాద్రి కొత్తగూడెం వాస్తవ్యులు భీమా శ్రీధర్, శ్రీవల్లి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ, రాపాక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

- కూటమి ప్రభుత్వంలో నైనా గిరిజనుల రహదారి కష్టాలు తీరేనా!
- ఎన్నికలలో ఎమ్మెల్యే యిచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మైదాన ప్రాంతాల నుండి ఏలేశ్వరం మీదుగా గిరిజన మండలాలకు పయనించే గిరిజనులకు రహదారి కష్టాలు ఇప్పట్లో తీరేటట్లు లేవు. సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఏలేశ్వరం మీదుగా అడ్డతీగల, వై రామవరం, రాజవొమ్మంగి, కేడీపేట అనేక గిరిజన గ్రామాలు ప్రధాన రహదారిగా ఉండే నర్సీపట్నం రోడ్డు తునాతునకలు అయిందని చెప్పాలి. రహదారిపై ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులు పడి ఛిద్రమై చెరువులను తలపిస్తుంది. ఆర్ అండ్ బి రహదారులు కొన్నిచోట్ల వేసినప్పటికీ, ఏలేశ్వరం మండల పరిధిలోని రమణయ్యపేట గిరిజన గ్రామం నుండి జె అన్నవరం వరకు గల సుమారు 11 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి మూడు దశాబ్దాలుగా మోక్షం కలగలేదు. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రతిసారి రాజకీయ నాయకులు ఈ ప్రాంతంలో ఓట్లు అడగడానికి వచ్చేటప్పుడు రహదారి నిర్మాణం కోసం నాయకులను నిలదీయడం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత రమణయ్యపేట నుంచి జె అన్నవరం వరకు గల రోడ్డును నిర్మిస్తామని హామీలు ఇవ్వడం, నెగ్గిన వెంటనే రాజకీయ నాయకులు ముఖం చాటేయడం సర్వసాధారణమైపోయింది. గత ప్రభుత్వం ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు ఈ రోడ్డు విషయంలో జె అన్నవరం గ్రామంలో నిరసన సెగ తగిలింది. 2024 ఎన్నికల సమీపిస్తున్న వేళ ఇప్పటి ఎమ్మెల్యే అయిన వరుపుల సత్యప్రభ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డుకి అడ్డుగా గోడను కట్టి నిరసన తెలియజేశారు. కానీ ఎన్ని నిరసనలు చేపట్టిన సరే ప్రభుత్వం గిరిజనుల వైపు చూడటం లేదనేది నిదర్శనంగా రమణయ్యపేట, జె అన్నవరం రోడ్డు ప్రత్యక్ష సాక్ష్యం. 2024 ఎన్నికల్లో టిడిపి పార్టీ నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా నెగ్గిన వరుపుల సత్యప్రభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 11 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులతో రమణయ్యపేట గ్రామం వద్ద రోడ్డు నిర్మాణ పనులు టెంకాయ కొట్టి ప్రారంభించారు. జిల్లాలో ఉన్న ఆర్ అండ్ బి రోడ్లన్నీ ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడంతో గత వైయస్సార్ ప్రభుత్వం చేసిన పనులకు చెక్కులు కూడా ఇవ్వలేదని కాంట్రాక్టర్ వాపోయాడు. ఎమ్మెల్యే సత్య ప్రభ చొరవతోకాంట్రాక్టర్ మళ్లీ రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఉపక్రమించాడు. రహదారి నిర్మాణానికి వాడే ముడి సరుకుల ధరలు పెరిగిపోవడంతో పాత అంచనాలతో రోడ్లు వేయలేనని, తనకు ఇవ్వవలసిన పాత బకాయి 21 కోట్లు తక్షణమే ప్రభుత్వం చెల్లించి, నూతనంగా నిర్మించవలసిన రమణయ్యపేట నుండి జె అన్నవరం వరకు గల సుమారు 11 కిలోమీటర్ల రోడ్డుకు సుమారు రూ.22 కోట్లు ఖర్చు అవుతుందని అవి కూడా ప్రభుత్వం ఫైనాన్షియల్ అనుమతులు మంజూరులో పెడితే నూతనంగా రోడ్డు నిర్మించగలనని, లేనిపక్షంలో ఈ కాంట్రాక్టును వదులుకుంటానని సదరు కాంట్రాక్టర్ భీష్మించుకు కూర్చున్నాడని విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పటికే 11 కిలోమీటర్ల మేర ఎర్త్ వర్క్ పాక్షికంగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని మరో షరతు కాంట్రాక్టర్ విధించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఆ పనిని మరో కాంట్రాక్టర్ చేపట్టడానికి వీలు లేకుండా పోయింది. పాత కాంట్రాక్టర్ ససేమిరా పనులు చేసేది లేదంటున్నాడు. చేసేదేమీ లేక ఎన్డీఏ ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వ అధికారులు తలలు పట్టుకు కూర్చున్నారు. ప్రజల నుంచి ఎన్నిసార్లు ధర్నాలు, నిరసనలు చేసినప్పటికీ నూతనంగా రోడ్డు నిర్మాణం జరిగేటట్లు లేదు. గిరిజనులకు మరికొంత కాలం ప్రయాణ కష్టాలు తప్పేటట్లు లేవు. ఏదేమైనా గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్యం, నిత్యం ప్రధాన అవసరాలకు మైదాన ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ ఆర్ అండ్ బి రహదారి తప్ప మరే ఇతర మార్గం లేదు. కావున ఏలేశ్వరం మీదుగా వెళ్లే నర్సీపట్నం రోడ్డు వెంటనే పునర్నిర్మించి గిరిజనుల కష్టాలు తీర్చాల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్య ప్రభ 2024 ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒలంపిక్ రన్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : సోమవారం 23న కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం దుద్దివారి అగ్రహారం ఆఫీసర్స్ క్లబ్ నుంచి ఒలింపిక్ రన్ ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని కోనసీమ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆఫీసర్స్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఒలింపిక్ రన్ వివరాలను వెల్లడించారు. కార్యక్రమానికి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోమవారం ఉదయం జరిగే ఒలిపిక్ రన్ విజయవంతం చేయాలని, వేలాదిగా తరలివచ్చి ఒలంపిక్ రన్‌కు మద్దతుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా జరిగే ఒలంపిక్ రన్ సన్నాహాలను తన తండ్రి రంకిరెడ్డి కాశి విశ్వేశ్వరరావు ఏర్పాట్లు చేసేవారని ఆయన అనంతరం ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు ఏర్పాట్లు చేశారన్నారు. సోమవారం జరిగే ఒలిపిక్ రన్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తాను ఒలంపిక్ రన్ ముందుండే నడిపిస్తానని సాత్విక సాయిరాజ్ తెలిపారు. సమావేశంలో పప్పుల శ్రీరామ్ చంద్రమూర్తి, కల్వకొలను బాబు తదితరులు పాల్గొన్నారు.

మండల టీడీపీ ఉపాధ్యక్షుడిగా కాలా జయరాజు

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా సూర్యారావు పేట గ్రామానికి చెందిన కాలా జయరాజును నియమిస్తూ ఆదివారం కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలలో జయరాజు కుటుంబ సభ్యులు సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు నమ్మకస్తుడుగా ఉంటారు. అలాగే గ్రామంలో బూత్ కన్వీనర్‌గా ఉంటూ ప్రతి సమస్యలను చాకచక్యంగా తనదైన శైలిలో పరిష్కరిస్తూ వస్తున్నారు. మండలంలో వివాదరహితుడిగా ఉంటూ అన్ని వర్గాల వారిని కలుపుకొని వెళ్లడంలో జయరాజు దిట్ట. అందుకనే ఆయనకు కీలకమైన ఈ పదవిని అప్పగించి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే సత్యానందరావుకు, ఈదల సత్తిబాబుకు, సలాది నాగేశ్వరరావుకు, వంటిపల్లి సతీష్‌కు, బీసీ నాయకులకు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాండు ఆశయ సాధనకు కృషి చేయాలి: కోనాల

విశాలాంధ్ర-భీమవరం: నాగిడి పాండురంగారావు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆదివారం నాగిడి పాలెంలో జరిగిన పాండు సంతాప సభలో భీమారావు మాట్లాడుతూ తాను బ్రతికి ఉన్నంతకాలం పార్టీ కోసం ఎంతో పాటుపడిన వ్యక్తి అని లోసరి- గుట్లపాడు పరిసర ప్రాంతాల్లో జరిగిన భూపోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తి అని కొనియాడారు. భూపోరాట యోధుడు తీర ప్రాంత నాయకుడు నాగిడి సాంబమూర్తికి వెన్నంటి ఉంటూ ఎన్నో పోరాటాల్లో ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో సమస్యలు పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన అనేక కార్యక్రమాల్లో పాండు పాల్గొన్నారని కోనాల గుర్తు చేశారు. పార్టీ నిర్మాణం కోసం అభివృద్ధి కోసం కృషి చేసిన పాండు మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన నివాళులర్పించారు. సీపీఐ భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ పాండు చిన్ననాటి నుండి ప్రజా ఉద్యమాల్లో పాల్గొని భూస్వాములతో ఎన్నో సమస్యలు ఏర్పడిన సాంబమూర్తితో ఉంటూ సమస్యలను దీటుగా ఎదుర్కొన్నారన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పటికీ పార్టీ పట్ల ఎంతో నిబద్ధత, అంకితభావంతో పని చేశారన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి ఈ ప్రాంత ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు నాగిడి తులసిరావు, నాగిడి శాంతమూర్తి, పార్టీ శాఖ కార్యదర్శి నాగిడి నాగరాజు, తిరుమాని చంటి రాజు, తిరుమాని భోజరాజు పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులు అభిమానులు ఈ సంతాప సభ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

ఇసుక అక్రమ రవాణా... అడ్డుకున్న ప్రజలు

విశాలాంధ్ర - సీతానగరం: అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న గ్రామ ప్రజలు. మండలంలో రామచంద్రపురం గ్రామ శివారులో నుండి గత కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతూ యద్దేచ్ఛగా దోపిడి సాగిస్తున్నారు. దీంతో శనివారం అర్ధరాత్రి సమయంతో పురుషోత్తపట్నం గ్రామ ప్రజలు ఏటిగట్టుపై ఇసుక లోడ్‌తో వెళుతున్న ఏడు లారీలను గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. దీంతో యంత్రా లతో ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారు 2022 గత ప్రభుత్వంలోలో తీసుకున్న అనుమతులను చూపించి ప్రజలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. సుమారు రెండు గంటల పాటు ఏటిగట్టు రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ అసలే ఏటిగట్టు రోడ్డు అధ్వాంగా మారి రాకపోకలకు ఇబ్బందులూ పడాల్సి వస్తుంటే పెద్ద పెద్ద లారీలతో పగలు రాత్రి తేడా లేకుండా యదేచ్చగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిపి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు అడిగితే గత ప్రభుత్వంలో అనుమతులు చూపించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1నుంచి అక్టోబర్ 15 వరకూ ఇసుక తవ్వకాలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసిన ఇక్కడ అధికారులు పర్యవేక్షణా లోపంతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వీఆర్ఓ నందేశ్వరరావును వివరణ కోరగా ఈ ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు అని, ఈ అక్రమ తవ్వకాలు పై ఉన్నత అధికారులకు తెలుపుతామని అన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటక ప్రదర్శన



విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం లోని కోనసీమ భానోజీ రామర్స్ కళాశాల ప్రాంగణం లో జరిగిన ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటక ప్రదర్శనకు ఎంపీ గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. సంస్కార భారతీ ఆంధ్రప్రదేశ్ కళా సాహిత్యాల అఖిల భారతీయ సంస్థ, సిబిఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి సాయిబాబా నాట్య మండలి విజయవాడ వారిచే జరిగే ఈ నాటక ప్రదర్శనను హరీష్ బాలయోగి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలతో భారతీయ సాంప్రదాయాలను నేటి తరాలకు వివరిస్తున్న నాట్య మండలిని, ఈ కార్యక్రమ నిర్వాహకులను ఎంపీ హరీష్ బాలయోగి అభినందించారు.